క్లుప్తంగా

తాగునీటి కోసం ఆందోళన

పెద్దారవీడు: మండల కేంద్రం పెద్దారవీడులో ప్రభుత్వ కార్యాలయాల వద్ద గ్రామస్తులు తాగు నీటి సమస్య పరిష్కరించాలని బుధవారం సాయంత్రం బిందెలతో ఆందోళన చేశారు. మార్కాపురం-పెద్దదోర్నాల రహదారిపై కొద్ది సేపు ఆందోళన చేయడంతో రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలిచిపోయి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు మండల పార్టీ కన్వీనర్ పాలిరెడ్డి కృష్ణారెడ్డికి సమాచారం ఇచ్చారు. వెంటనే ఆయన మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన మంత్రి ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రామకృష్ణతో మాట్లాడి గురువారం నుంచి గ్రామంలో ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ట్యాంకర్ల యజమానులకు తన సొంత నిధులు ఇస్తానని చెప్పారు. దీంతో ప్రజలు ఆందోళన విరమించారు.

ఆహారపు అలవాట్లపై సర్వే

ముండ్లమూరు: ప్రజల రోజువారి ఆహారపు అలవాట్లపై సర్వే చేస్తున్నట్లు వైద్యాధికారి జ్యోతి తెలిపారు. ముండ్లమూరులో బుధవారం వివిధ రకాల సామాజిక వర్గాల వారి రోజువారీ ఆహారపు అలవాట్లు, వారు తీసుకుంటున్న పౌష్టికాహారం గురించి సర్వే చేశామన్నారు. 14 రోజుల పాటు వారు తీసుకునే ఆహార పదార్థాల గురించి వివరాలు సేకరించాల్సి ఉందన్నారు. మంచి ఆహారపు అలవాట్లపై ప్రజలకు అవగాహన కల్పిస్తామని చెప్పారు. అమీనియా పరీక్షలు చేస్తామని చెప్పారు. సీహెచ్‌ఓ నారాయణరావు, హెచ్‌వీ కన్యాకుమారి, హెచ్‌ఎస్ సుబ్బారావు పాల్గొన్నారు.

అంకిత భావంతో విద్యనభ్యసించాలి

కంభం: మండలంలోని తురిమెళ్ల మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల వార్షికోత్సవంతో పాటు విద్యార్థుల వీడ్కోలు సమావేశం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఎంఈఓ బి.మాల్యాద్రి మాట్లాడుతూ విద్యార్థులు అంకిత భావంతో విద్యను అభ్యసించాలన్నారు. ప్రభుత్వం విద్యారంగంలో మార్పులు తీసుకొచ్చి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెడుతోందన్నారు. ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తయారు చేస్తోందన్నారు.

ఘనంగా ప్రభుత్వ పాఠశాల వార్షికోత్సవం

దర్శి: స్థానిక ఎస్‌ఎస్‌సీ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. విద్యాకమిటీ చైర్మన్ విష్ణుప్రియ, ఉపాధ్యాయులు ఎంఈఓ కాకర్ల రఘురామయ్యను ఘనంగా సత్కరించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఉపాధ్యాయులు సీహెచ్ బసవయ్య, వరలక్ష్మి, లావణ్య, ఈశ్వరమ్మ, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

పుల్లలచెరువు: జిల్లా అధికారుల ఆదేశాలపై స్థానిక బస్‌స్టాండ్ సెంటర్‌లో పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎంపీపీ లాజర్, జెడ్పీటీసీ వాగ్యానాయక్‌లు బుధవారం ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ఎండలు బాగా ఉన్నందున అధికారుల ఆదేశాలపై చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం ఎంతో సంతోషకరమని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తహసీల్దార్ దాసు, ఎంపీడీవో రాజ్యలక్ష్మి, ఈవోఆర్డీ బాలునాయక్, సర్పంచ్ ఓబులేసు, ఎంపీటీసీ రాములు, నాయకులు జానకీ రఘు, కాశయ్య పాల్గొన్నారు.

గర్భిణుల వివరాలు నమోదు చేయాలి

గిద్దలూరు రూరల్: గర్భిణుల వివరాలు నమోదు తప్పనిసరిగా చేయించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుబ్బలక్ష్మి అన్నారు. ప్రజా ఆరోగ్య కార్యక్రమంలో భాగంగా మండలంలోని అక్కలరెడ్డిపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం గర్భిణులు, బాలింతలకు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రతి ఒక్కరికి ఆరోగ్య సంరక్షణ కోసం ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు తీసుకొస్తోందన్నారు. గర్భిణులు, బాలింతల ఆరోగ్యం కోసం బలమైన పౌష్టికాహారం అందజేస్తున్నట్లు పేర్కొన్నారు.

నవోదయ విద్యాలయ అభివృద్ధికి కృషి



సమీక్షిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

తర్లుపాడు: జవహర్ నవోదయ విద్యాలయ అభివృద్ధికి, విద్యార్థుల మెరుగైన భవిష్యత్తుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని కలెక్టర్ దినేష్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం కలుజువ్వలపాడులోని జేఎన్‌వీ విద్యాలయ నిర్వాహణ కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వచ్చే విద్యాసంవత్సరం నాటికి విద్యాలయంలో బందోబస్తు కార్యాకలాపాలు, నీటి సరఫరా, క్రీడా కార్యకలాపాల విస్తరణ కోసం భూమి కేటాయింపు, విద్యాలయం వద్ద ఆర్టీసీ బస్ స్టాప్ ఏర్పాటు, విద్యార్థులకు వైద్య పరీక్షల నిర్వహణ, ప్రాంగణం నుంచి వెళ్తున్న విద్యుత్ లైన్ మార్గాన్ని మార్చడం, నిరంతర విద్యుత్ సరఫరా, వైద్యుడి నియామకం తదితర అంశాలపై చర్చించారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో కెరీర్ గైడెన్స్ క్లాసులు నిర్వహిస్తున్న విధంగా జేఎన్‌వీలో నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో సబ్ కలెక్టర్ సేతు మాదవన్, ప్రిన్సిపాల్ ప్రసన్న కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధికి అందలం

- వైఎస్సార్ సీపీ నాలుగేళ్ల పాలనలో మార్కాపురం అభివృద్ధికి రూ.1,525 కోట్లు
- శరవేగంగా సాగుతున్న వెలిగొండ ప్రాజెక్ట్, మెడికల్ కాలేజీ పనులు
- 16 వేల మంది అర్హులకు నివేశన స్థలాలు మంజూరు
- బాబు జమానాలో పశ్చిమ ప్రకాశం వైపు కన్నెత్తి చూడని వైనం

మార్కాపురం:

ఆంధ్రప్రదేశ్ విభజన అనంతరం హామీల మీద హామీలు గుప్పించి గద్దెనెక్కిన నారా చంద్రబాబునాయుడు ఆ తర్వాత అభివృద్ధి ఊసే మరిచారు. వైఎస్సార్ హయాంలో ప్రారంభించిన వెలిగొండ ప్రాజెక్టు పనులు పూర్తవుతాయేమోనని ఆశించిన పశ్చిమ ప్రకాశం వాసుల కల కలగానే మిగిలింది. ఐదేళ్ల జమానాలో అంటే 2014–19 మధ్య ఐదు పర్యాయాలు సీఎం హోదాలో జిల్లా పర్యటనకు వచ్చిన చంద్రబాబు.. ఏ పండగ సమీపంలో ఉంటే ఆ పండగకు వెలిగొండ నీళ్లు ఇస్తామని చెబుతూ పబ్బం గడిపారు. ఈ సంగతి అలా ఉంచితే.. విద్యుత్, వైద్య రంగాలను పూర్తిగా గాలికొదిలేశారు. తాగునీటి కోసం వాటర్ గ్రిడ్ పేరుతో హంగామా చేసి ప్రజల చెవుల్లో పూలు పెట్టారు. పశ్చిమ ప్రకాశంలోని గిద్దలూరు, వైపాలెం ఎమ్మెల్యేలను కొనుగోలు చేసిన చంద్రబాబు.. ఆ నియోజకవర్గాల అభివృద్ధికైనా చిల్లిగవ్వ ఇవ్వలేదు. వైఎస్సార్ సీపీ అధికారం చేపట్టిన దరిమిలా పశ్చిమ ప్రకాశంలో అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్ పెద్దపీట వేశారు. నాలుగేళ్ల వైఎస్సార్ సీపీ పాలనలో ఒక్క మార్కాపురం నియోజకవర్గానికే రూ.1525 కోట్లు కేటాయించగా.. ఆ పనులు వివిధ దశల్లో ఉన్నాయి. అభివృద్ధి పనులను గమనిస్తున్న ప్రజలు.. చంద్రబాబు జమానాకు, వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి మధ్య తేడాను బేరీజు వేసుకుంటున్నారు.

నాలుగేళ్లలో మార్కాపురానికి నిధుల వరద

- మెడికల్ కాలేజి నిర్మాణం, వైద్యశాలల అభివృద్ధికి రూ.482 కోట్ల కేటాయింపు
- మార్కాపురంలో షాదీఖానా నిర్మాణానికి రూ.2 కోట్లు
- మార్కాపురంలో తాగునీటి సమస్య నివారణకు 22.40 కోట్లు
- పొదిలి పెద్దచెరువు అభివృద్ధికి రూ.50.13 కోట్లు



గొట్టిపడియ వద్ద నిర్మాణంలో ఇన్‌టెక్ వెల్

- 3 సబ్ స్టేషన్ల నిర్మాణానికి రూ.9.50 కోట్లు
- చెన్నకేశవస్వామి రాజగోపురాల నిర్మాణానికి రూ.2 కోట్లు
- నాడు–నేడు ఫేజ్–1, 2 లో పాఠశాల అభివృద్ధికి రూ.48 కోట్లు
- ఆర్అండ్‌బీ పరిధిలో రోడ్లు, రిపేర్లు, ఎన్‌డీబీ వర్కులకు రూ.22 కోట్లు
- పంచాయతీరాజ్ పరిధిలో సచివాలయాలు, సచివాలయ భవనాలు, సీసీరోడ్లు, గ్రావెల్ రోడ్లు, బీటీ రోడ్ల ఏర్పాటు, మరమ్మతులకు రూ.150 కోట్లు
- వాటర్‌గ్రిడ్, ఇంటెక్‌వెల్ ట్యాంక్ నిర్మాణానికి, జల్‌జీవన్ మిషన్ కింద తాగునీటికి రూ.720 కోట్లు
- మార్కాపురం టౌన్, రూరల్, తర్లుపాడు, కొనకనమిట్ల, పొదిలి మండలాల పరిధిలో 16 వేల మందికి స్థలాలు, ఇళ్ల మంజూరు
- తర్లుపాడు మండలం కలుజువ్వలపాడు వద్ద ఏపీఐఐసీకి 120 ఎకరాల కేటాయింపు
- కలుజువ్వలపాడు వద్ద రూ.5 కోట్లతో మిల్లెట్ ప్రొడక్షన్ యూనిట్ ఏర్పాటు
- పొదిలిలో ముల్లా ఇంటి పేరు కలవారికి బీసీ ఈ సర్టిఫికెట్లు జారీ
- మార్కాపురంలో అంబేడ్కర్ భవన్‌కు రూ.40 లక్షలు, బీసీ భవన్‌కు రూ.40 లక్షలు మంజూరు
- పొదిలి మెయిన్ రోడ్డు వెడల్పు, డ్రైన్స్, కాలువలు, డివైడర్ల ఏర్పాటుకు రూ.11 కోట్లు మంజూరు.

వెలుగొండ ప్రాజెక్టుపై ఎవరి చిత్తశుద్ధి ఎంత?

ప్రాజెక్టు నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు దాదాపు రూ.5,950 కోట్లు ఖర్చు చేసింది. రెండు దశల పనుల కోసం 8052.10 కోట్ల రూపాయలకు పరిపాలన అనుమతులిచ్చారు. ప్రాజెక్టు నిర్మాణం, భూ సేకరణ, పునరావాసం, అటవీ భూముల కోసం నిధులు ఖర్చు చేస్తూ వస్తున్నారు. 2004 నుంచి వైఎస్సార్ హయాంలో రూ.1448.14 కోట్లు ఖర్చు పెట్టారు. టీడీపీ జమానాలో 2014–18 మధ్య రూ.600 కోట్లు మాత్రమే వెచ్చించారు. పెట్టిన ఖర్చు ఉద్యోగుల జీతభత్యాలకు మాత్రమే సరిపోయింది. వైఎస్ జగన్ ప్రభుత్వంలో టన్నెల్–1 పనులు పూర్తి చేయడమే కాకుండా పునరవాస కాలనీల పనులు కూడా వేగంగా సాగుతున్నాయి. 3 జిల్లాల ప్రజల సాగు, తాగునీటి అవసరాలు తీర్చే ఈ ప్రాజెక్టుపై చంద్రబాబు అలవిమాలిన నిర్లక్ష్యం ప్రదర్శించారనేది సుస్పష్టం.

బాబు జమానాలో వెలిగొండ బడ్జెట్ ఇలా..

2014–15	రూ.76.58 కోట్లు
2015–16	రూ.153.89 కోట్లు
2016–17	రూ.200కోట్లు
2017–18	రూ.200 కోట్లు
2018–19	రూ.334.05 కోట్లు

ఈ విధంగా బడ్జెట్ కేటాయించినప్పటికీ 2014–19 మధ్య వెలిగొండ కోసం ఖర్చు చేసింది కేవలం రూ.600 కోట్లే..



వెలిగొండ ప్రాజెక్టు టన్నెల్

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఇలా..

రివర్స్ టెండరింగ్ ద్వారా గత ప్రభుత్వంలో జరిగిన అవినీతిని అరికట్టి పనులు వేగంగా చేపట్టాలని ఆదేశించారు. గత ఏడాది 856.15 కోట్ల రూపాయల బడ్జెట్ కేటాయించారు. తీగలేరు, గొట్టిపడియ, తూర్పు ప్రధాన కాలువ, ఉపకాలువలు, ఉదయగిరి ఉపకాలువ, పడమర ఉపకాలువ, టి–5 కాలువల పనులు పూర్తయ్యాయి. ముంపు గ్రామాలైన కలనూతల వారికి ఇడుపూరు– 1, 2లో, గుండంచర్ల నిర్వాసితులకు తోకపల్లి వద్ద, సుంకేసుల గ్రామస్తులకు గొగులదిన్నె వద్ద, గొట్టిపడియ, అక్కచెరువు గ్రామస్థులకు వేములకోట వద్ద, సాయిరాం నగర్, రామలింగేశ్వరపురం వాసులకు ఓందుట్ల వద్ద పునరావాస పనులు జరుగుతున్నాయి. ఇదే సమయంలో గొట్టిపడియ వద్ద వెలిగొండ నీటిని మార్కాపురం, గిద్దలూరు, యర్రగొండపాలెం, కనిగిరి నియోజకవర్గాల్లో ప్రజలకు అందించేందుకు ఇన్‌టెక్ వెల్ పనులను వేగంగా చేస్తున్నారు.

వైద్య రంగానికి సీఎం జగన్ పెద్దపీట

టీడీపీ జమానాలో నిర్లక్ష్యానికి గురైన వైద్య రంగానికి వైఎస్ జగన్ ప్రభుత్వం జీవం పోసింది. బాబు జమానాలో జిల్లా వైద్యశాలలో 8 మంది మాత్రమే డాక్టర్లు ఉండగా ప్రస్తుతం 31 మంది డాక్టర్లు సేవలందిస్తున్నారు. గడిచిన నాలుగేళ్లలో జిల్లా వైద్యశాల అభివృద్ధికి రూ.10 కోట్లు కేటాయించారు. రాయవరం దగ్గర రూ.475 కోట్లతో మెడికల్ కాలేజీ నిర్మాణ పనులు సాగుతున్నాయి. సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు త్వరలో అందుబాటులోకి రానున్నాయి.



మెడికల్ కాలేజీ(ప్రతీకాత్మక చిత్రం)

అక్టోబర్‌లో వెలిగొండ నీళ్లు



అక్టోబర్‌లో వెలిగొండ నీళ్లు మార్కాపురం ప్రాంతానికి రానున్నాయి. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెలిగొండ నిర్మాణంపై ప్రత్యేక దృష్టి పెట్టారు. మార్కాపురం పట్టణంలో గత 14 ఏళ్ల నుంచి ఉన్న నీటి సమస్య పరిష్కారానికి రూ.22.40 కోట్లు కేటాయించారు. పొదిలిలో 30 ఏళ్ల నుంచి ఉన్న నీటి సమస్యను తొలగించేందుకు రూ.50.13 కోట్లు మంజూరు చేశారు. పట్టణంలో షాదీఖానా, రాయవరం వద్ద మెడికల్ కాలేజ్ నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. పశ్చిమ ప్రకాశం ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్యం అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. ఇన్‌టెక్ వెల్ ట్యాంక్ త్వరలోనే పూర్తి చేసి మార్కాపురం, యర్రగొండపాలెం, కనిగిరి ప్రాంతాలకు తాగునీరు అందిస్తాం.

– ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

జనరంజకంగా జగనన్న పాలన



వృద్ధుడితో ఆప్యాయంగా మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

- ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి
- కాట్రగుంటలో గడపగడపకు మన ప్రభుత్వం

కొనకనమిట్ల: జగనన్న పాలన జనరంజకంగా సాగుతోందని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం కాట్రగుంట, ఎస్సీ, బీసీ కాలనీల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులరెడ్డి, ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణయాదవ్, జడ్పీటీసీ అక్కిదాసరి ఏడుకొండలు, వైస్ ఎంపీపీ గొంగటి జెనీఫాతో కలిసి నిర్వహించారు. ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందుతున్నాయా అంటూ ఆప్యాయంగా పలకరిస్తూ ఎమ్మెల్యే గడపగడపకు తిరిగారు. రాజకీయాలకు అతీతంగా అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందజేస్తున్న ఏకైక ప్రభుత్వం జగనన్న ప్రభుత్వం అని కొనియాడారు. కాగా ఎమ్మెల్యేకు కాట్రగుంట ప్రజలు మేళతాళాలతో అపూర్వ స్వాగతం పలికారు. కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ మోరా శంకర్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ కామసాని వెంకటేశ్వరరెడ్డి, ఉడుముల కాశిరెడ్డి, మాజీ ఎంపీపీ ఉడుముల రామానారాయణరెడ్డి, చిరుగూరి కోటేశ్వరరావు, సైకం రమణారెడ్డి, ఎంపీడీఓ జనార్దన్, ఏఓ ప్రసన్న రంగలక్ష్మి, ఏపీఎం గోపాలకృష్ణారెడ్డి, ఎస్సై దీపిక, స్థానిక పార్టీ నాయకులు గంగిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, కందెర పెద్దన్న యాదవ్, చల్లా మల్లికార్జునచౌదరి, గోనుగుంట్ల బ్రహ్మయ్యచౌదరి, రాజాల వెంకటేశ్వరరెడ్డి, పెండెం కొండయ్య, క్రిష్టయ్య, కొండలరావు, సానికొమ్ము రవి తదితరులు పాల్గొన్నారు.

జీవనోపాధులు పెంపొందించుకోవాలి

ముండ్లమూరు: ప్రభుత్వం మంజూరు చేసిన వైఎస్సార్ ఆసరా నగదుతో మహిళలు జీవనోపాధులు పెంపొందించుకోవాలని వైఎస్సార్ క్రాంతి పథం దర్శి క్లస్టర్ ఏరియా కో ఆర్డినేటర్ వసుంధరాదేవి అన్నారు. స్థానిక ఆ సంస్థ కార్యాలయంలో బుధవారం గ్రామ సంఘ సహాయకులతో ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి సంఘానికి అవసరమైన రుణాలు మంజూరు చేస్తామని చెప్పారు. తీసుకున్న రుణాలతో మహిళలు తమ ఆర్థిక అవసరాలతో పాటు వారికి అనుభవం ఉన్న వ్యాపారాలు నిర్వహించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. స్త్రీనిధి రుణాలు క్రమం తప్పకుండా చెల్లించేలా చూడాలన్నారు. గత ఆర్థిక సంవత్సరానికి లెక్కలు తేల్చి ఆడిట్‌కు బుక్స్ సిద్ధం చేయాలన్నారు. స్త్రీనిధి మేనేజర్ పవన్ కళ్యాణ్, మోహనరావు, గురవయ్య, డేవిడ్ పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

గిద్దలూరు రూరల్: అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని అగ్నిమాపక శాఖ అధికారి ఆంజనేయులు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా పట్టణంలోని డీజీఆర్ వైద్యశాల ఆవరణలో బుధవారం అక్కడి సిబ్బందికి అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వేసవి కాలంలో ఎక్కువగా అగ్ని ప్రమాదాలు సంభవించే అవకాశాలు ఉన్నాయని, వాటి నుంచి ప్రజలు ఏ విధంగా రక్షించుకోవాలనే దానిపై సిబ్బంది సూచనలు సలహాలు ఇస్తారని పేర్కొన్నారు.

కంభం: అగ్ని వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాల ఆవరణలో అగ్నిమాపకశాఖ అధికారి డీపీ చౌదరి ఆధ్వర్యంలో అగ్నిమాపక శాఖ సిబ్బంది అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు ఎలా రక్షించుకోవాలనే విషయాలపై అవగాహన ఉండాలన్నారు.

దర్శి: అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని ఫైర్ కేంద్రాధికారి సీహెచ్ జాలయ్య సూచించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా బుధవారం దర్శి ప్రభుత్వ ఆస్పత్రిలో అవగాహన కార్యక్రమం జరిగింది. జాలయ్య మాట్లాడుతూ గ్యాస్ ఫైర్ అయినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. చిన్న చిన్న ప్రమాదాలు జరిగినప్పుడు, అగ్నిప్రమాదంలో స్పృహతప్పి పడిపోయినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. వైద్యుడు ఆంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్ అందజేత

పుల్లలచెరువు: సీఎం రిలీఫ్ ఫండ్ చెక్‌ను రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ బుధవారం తన కార్యాలయంలో బాధితురాలికి అందజేశారు. మండలంలోని వెంకటరెడ్డిపల్లికి చెందిన అన్నపురెడ్డి నాగేశ్వరమ్మకు సీఎం సహాయ నిధి నుంచి రూ.లక్ష మంజూరైంది. ఆ చెక్‌ను మంత్రి సురేష్ అందచేశారు. ఏఎంసీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, వై.పాలెం కన్వీనర్ ఓబుల్‌రెడ్డి, జెడ్పీటీసీ వాగ్యానాయక్ పాల్గొన్నారు.



చెక్ అందజేస్తున్న మంత్రి సురేష్

సరస్వతీదేవి విగ్రహానికి పూజలు



పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే ఉడుముల

పొదిలి: స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో రిటైర్డ్ పీడీ దోర్నాల వరలక్ష్మమ్మ ఆధ్వర్యంలో సరస్వతి దేవి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. బుధవారం మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసుల రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంఈఓలు ఎం.శ్రీనివాసరెడ్డి, ఈవీ రంగయ్య, కొనకనమిట్ల ఎంపీపీ ఎం.మురళి, జెడ్పీటీసీ ఏడుకొండలు, పార్టీ మండల కన్వీనర్ మోరా శంకరరెడ్డి, గుంటూరు పిచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

24 అవర్స్ డైటరీ రీకాల్ సర్వే

దొనకొండ: మండలంలోని పెదన్నపాలెం సచివాలయం పరిధి ఎస్‌ఎన్‌పల్లిలో వైద్యాధికారి ఎం.సునీత పర్యవేక్షణలో వైద్య సిబ్బంది 24 అవర్స్ డైటరీ రీకాల్ సర్వే బుధవారం చేశారు. ఈ సందర్భంగా ఓసీ, బీసీ, ఎస్సీ 10 కుటుంబాలను సర్వే చేశారు. సర్వేలో ప్రతి కుటుంబం ఒక రోజులో ఎటువంటి ఆహారం తీసుకుంటున్నారో తెలుసుకున్నారు. కేలరీస్, ప్రొటీన్స్, ఐరన్ ఎంత శాతం తీసుకుంటున్నారు అనే దానిపై తమ సిబ్బంది సర్వే చేశారని వైద్యాధికారి తెలిపారు. గర్భిణులను పరీక్షించి ఆరోగ్య సలహాలు ఇచ్చారు. సీహెచ్‌ఓ ఇన్యాసమ్మ, హెచ్‌వీలు ప్రభావతి, రమణమ్మ, ఎంపీహెచ్ అలెగ్జాండర్, ఏఎన్‌ఎం కృష్ణ కుమారి పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు వెలుగొండ విద్యార్థి

కొనకనమిట్ల: రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు వెలుగొండకు చెందిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులం విద్యార్థి అనపర్తి నెహెమియా ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ శ్రీరామ్ కోటేశ్వరరావు తెలిపారు. ఈ నెల 21 నుంచి 23వ తేదీ వరకు అనంతపురం జిల్లా ధర్మవరంలో నిర్వహించనున్న పోటీల్లో పాల్గొంటున్నట్లు పీఈటీ అంకయ్య తెలిపారు.

మస్తాన్‌వలి సేవలు మరువలేనివి

తాళ్లూరు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యున్నతికి మాజీ వార్డు మెంబర్ మస్తాన్‌వలి సేవలు మరువలేనివని ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, జెడ్పీటీసీ మారం వెంకటరెడ్డి అన్నారు. రజానగరం మాజీ వార్డు మెంబర్ షేక్ మస్తాన్‌వలి (85) బుధవారం గుండెపోటుతో మృతి చెందాడు. ఆయనకు భార్య, నలుగురు పిల్లలు ఉన్నారు.

రీ సర్వేపై అవగాహన ఉండాలి

తాళ్లూరు: భూముల రీ సర్వేపై రైతులకు అవగాహన ఉండాలని తహసీల్దార్ రామ్మోహన్‌రావు అన్నారు. బొద్దికూరపాడు, శంకర నారాయణపురం, శివరామపురం, దోసకాయలపాడు గ్రామాల్లో రైతులకు రీ సర్వేపై బుధవారం అవగాహన కల్పించారు. ఒంగోలు డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ రైతులు రెవెన్యూ అధికారులకు సహకరిస్తే సర్వే విజయవంతమవుతుందన్నారు. తహసీల్దార్ రామ్మోహన్‌రావు మాట్లాడుతూ రైతులు భూహక్కులకు సంబంధించి తమ వద్ద ఉన్న ఆధారాలు తీసుకుని సంబంధిత వీఆర్‌ఓలకు సమర్పించాలని కోరారు. ఫొటో, ఆధార్ కార్డు, బ్యాంకు అకౌంట్ బుక్, పాస్ పుక్ జిరాక్స్ కాపీలు అందించాలని కోరారు. ఆర్థో గూగుల్ మ్యాప్ (ఏజీపీ)లను ప్రదర్శించారు. సొసైటీ మాజీ అధ్యక్షుడు పులి ప్రసాద్‌రెడ్డి, ఎంపీటీసీ బాలకోటయ్య, దోసకాయలపాడు సర్పంచి కేఎస్ వెంకటరామిరెడ్డి, శివరామపురం మాజీ సర్పంచి హనుమంతరావు, సర్వేయర్ ఆవుల శ్రీనివాసరావు, వీఆర్‌ఓలు నాగేశ్వరరావు, కోటేశ్వరరావు, చంద్రశేఖర్ రెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులకు నవరత్నాలు అందేలా చూడాలి

- ఏఎంసీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి

పుల్లలచెరువు: గ్రామాల్లో అర్హులకు నవరత్నాల ద్వారా సంక్షేమ పథకాలు అందేలా చూడాలని అధికారులను ఏఎంసీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ లాజర్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా ఏఎంసీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి హాజరై మాట్లాడుతూ గ్రామాల్లో అర్హులైన నిరుపేదలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని చెప్పారు. మూడు నెలలకు ఒకసారి జరిగే సమావేశానికి అధికారులు రాకుంటే ఎలాగని ప్రశ్నించారు. సమావేశానికి రాని అధికారులకు నోటీసులు జారీ చేయాలని ఎంపీడీవో రాజ్యలక్ష్మిని ఆదేశించారు. జెడ్పీటీసీ సభ్యుడు వాగ్యానాయక్ మాట్లాడుతూ చాల గ్రామాల్లో వలంటీర్లు సక్రమంగా పనిచేయడం లేదని, వారితో ప్రభుత్వానికి చెడ్డ పేరు వచ్చేలా ఉందని, పనిచేయని వలంటీర్లను తొలగించాలని ఎంపీడీవోను కోరారు. ఎంపీపీ లాజర్ మాట్లాడుతూ సమావేశాలు సరదాగా మాట్లాడుకోవడానికి కాదని, అధికారులు రాకుండా సమాచారం ఏలా తెలుస్తుందని నిలదీశారు. అధికారులు తగిన సమాచారంతో రావాలని, లేకుంటే జిల్లా అధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ప్రతి అధికారి మండల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఏవో సుధీర్‌బాబు మాట్లాడుతూ అర్హులైన రైతులు రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోవాలని, ప్రభుత్వం మరోసారి అవకాశం ఇచ్చినట్లు చెప్పారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి మాట్లాడుతూ పుల్లలచెరువులో తాగు నీటి ఇబ్బందుల దృష్ట్యా పైపు లైను ఏర్పాటుకు మంత్రి రూ.5లక్షల నిధులు మంజూరు చేశారని, వెంటనే పనులు ప్రారంభించి ఇంటింటికీ నీరు అందిస్తామని తెలిపారు. ఎంపీడీవో మాట్లాడుతూ సమావేశాలకు తగిన సమాచారంతో అధికారులు హాజరు కావాలని కోరారు. వివిధ శాఖ అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు హాజరయ్యారు.



మాట్లాడుతున్న ఏఎంసీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి

ప్రకృతి వ్యవసాయంలో ఖరీఫ్ యాక్షన్ ప్లాన్

కురిచేడు: ఈ ఏడాది ఖరీఫ్ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తున్నట్లు ప్రకృతి వ్యవసాయ సలహాదారు అబ్బూరి బ్రహ్మయ్య తెలిపారు. 850 మంది రైతులు టార్గెట్‌గా ఈ ఏడాది యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తున్నామన్నారు. బోధనంపాడులో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై బుధవారం అవగాహన కల్పించారు. గతేడాది మండలంలోని ఐదు గ్రామాలకు సంబంధించి 389 మంది రైతులను టార్గెట్ పెట్టుకోగా 426 మంది రైతులను ప్రకృతి వ్యవసాయంలోకి తెచ్చినట్లు పేర్కొన్నారు. ఈ ఏడాది మండలంలోని పడమరవీరాయపాలెం, వెంగాయపాలెం, కురిచేడు, బోధనంపాడు, గంగదొనకొండ గ్రామాల్లోని 200 సెల్ఫ్ హెల్ప్ గ్రూపుల్లోని మహిళా సంఘాలతో ఖరీఫ్ యాక్షన్ ప్లాన్ చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో 850 మందితో ప్రకృతి వ్యవసాయం చేయించటం, మిగిలిన 1150 మంది రైతు లందితో కిచెన్ గార్డెన్స్ వేయిస్తున్నట్లు బ్రహ్మయ్య తెలిపారు.

తాళ్లూరు: పాదువు గ్రామైఖ్య సంఘ సభ్యులు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన పెంచుకుని చిరుధాన్యాలు, ప్రకృతి సాగును ప్రోత్సహించాలని ఏపీఎం దేవరాజ్ కోరారు. వ్యవసాయ శాఖ, వైఎస్సార్ క్రాంతి పథం మహిళలు బుధవారం సంయుక్తంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. వ్యవసాయాధికారి ప్రసాదరావు మాట్లాడుతూ ప్రభుత్వం రైతు సాధికార సంస్థ ద్వారా అమలు చేస్తున్న ప్రకృతి వ్యవసాయంలో తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు వచ్చేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. అనంతరం ర్యాలీ నిర్వహించి వెల్లంపల్లి బస్టాండ్ కేంద్రంలో మానవహారంగా ఏర్పడ్డారు. ఎంఎంఎస్ అధ్యక్షురాలు విజయలక్ష్మి, సీసీలు కోటేశ్వరమ్మ, వీవీఏ నాయక్ పాల్గొన్నారు.

సామరస్యంగా ఆర్చి వివాదం పరిష్కారం

- పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్



సమావేశంలో మాట్లాడుతున్న పురపాలక శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్

యర్రగొండపాలెం: పట్టణంలోని ఇశ్రాయిల్‌పేటలో తలెత్తిన ఆర్చి వివాదం సామరస్యంగా పరిష్కరించుకున్నట్లు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. బుధవారం స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత రెండు రోజులుగా ఆర్చి నిర్మాణ విషయంపై ఇరువర్గాలలో మనస్పర్థలు ఏర్పడ్డాయి. ఒకరిపై ఒకరు రాళ్లు రువ్వుకున్నారు. ఈ సంఘటనపై మంత్రి జోక్యం చేసుకొని ఇరువర్గాల వారితో చర్చించారు. చర్చలు సఫలం కావడంతో ఇరువర్గాల పెద్దలతో కలిసి ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. అందరి ఆమోదయోగ్యంతో ఆర్చి నిర్మాణాన్ని నిలిపి వేశారని, ఆ ప్రాంతంలో ఎటువంటి నిర్మాణాలు జరగవని, ఎటువంటి విభేదాలు ఉండవని ఇరువర్గాలకు చెందిన వారు లిఖిత పూర్వకంగా రాసుకున్నారని తెలిపారు. ఇశ్రాయిల్‌పేట గుర్తింపు కోసం పంచాయతీ, రెవెన్యూ అధికారుల అనుమతితో ఒక పక్క పైలాన్ నిర్మించుకుంటారని అన్నారు. రాజకీయ అవకాశవాదులు ఈ సంఘటనను జటిలం చేయటానికి ప్రయత్నించవద్దని సూచించారు. తహసీల్దార్ కె.రవీంద్రరెడ్డి, దర్శి డీఎస్పీ, సీఐ కె.మారుతికృష్ణ, ఎస్సై జె.కోటయ్య, ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్, జెడ్పీటీసీ చేదూరి విజయభాస్కర్, ఏఎంసీ మాజీ చైర్మన్ ఒంగోలు మూర్తిరెడ్డి, ఇరువర్గాలకు చెందిన పెద్దలు పాల్గొన్నారు.